TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్


WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-208 పేజీలు:-4 శనివారం 11-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD | NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## ఏపీలో మళ్లీ కలకలం రేపుతున్న కరోనా

- ఏపీలో మళ్లీ కరోనా కలకలం.. కడప, రాజంపేటల్లో కోవిడ్ లక్షణాలతో ఇద్దరి మృతి!
- తీవ్ర కరోనా లక్షణాలతో చికిత్స పొందుతూ ఇద్దరి మృతి
- ప్రైమరీ కాంటాక్ట్స్ వివరాలను సేకరిస్తున్న మెడికల్ టీమ్స్



ప్రపంచాన్ని ఒకప్పుడు వణికించిన కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా కడప జిల్లాలో కోవిడ్ తరహా లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం - మిగతా 2 లో

## స్పెయిన్‌తో వాణిజ్య బంధాల రద్దుకు ట్రంప్ పిలుపు

- స్పెయిన్‌తో వ్యాపార బంధాలు కట్.. నాటో సదస్సులో డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- రక్షణ బడ్జెట్ కేటాయింపులపై అమెరికా తీవ్ర అసంతృప్తి
- ఇరాన్ దాడులకు స్థావరాలు నిరాకరించడమే వివాదానికి కారణం
- యూఎస్‌తో సంబంధాలు యథాతథమన్న స్పెయిన్ ప్రధాని
- ట్రంప్ వ్యాఖ్యలను 'రౌడీయిజం'గా అభివర్ణించిన స్పెయిన్ మంత్రి



టర్కీ రాజధాని అంకారాలో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన దూకుడు స్వభావాన్ని ప్రదర్శించారు. నాటో కూటమిలో భాగస్వామిగా ఉన్న స్పెయిన్‌పై ఆయన తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

### తెలంగాణ జనసేనలో
## కొత్త జోష్

పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు



- తెలంగాణ జనసేనలోకి పలువురు ప్రముఖుల చేరిక
- పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు

తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో - మిగతా 2 లో

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్
- కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి




2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు

### 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా



- తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత
- పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి
- గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత

తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో - మిగతా 2 లో

# ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు

అది పక్కా కుట్ర: కరూర్ ఘటనపై సీఎం విజయ్

- కరూర్ తొక్కిసలాట తర్వాత తొలిసారి ఆ జిల్లాకు సీఎం విజయ్
- ఘటనకు డీఎంకే, పోలీసులే కారణమంటూ తీవ్ర ఆరోపణలు
- నన్ను తప్పుదోవ పట్టించారని, ఇది ఒక కుట్ర అని వ్యాఖ్య
- బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వడాన్ని వ్యతిరేకించిన డీఎంకే
- ఉద్యోగ నియామకాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్, సుప్రీంకోర్టులో డీఎంకేకు చుక్కెదురు







గతేడాది సెప్టెంబర్‌లో 41 మంది మృతికి కారణమైన కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు తొలిసారిగా ఆ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గత డీఎంకే ప్రభుత్వం,

### బెంచ్‌పైకి కాగితాలు విసిరి సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం



- సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తీవ్ర గందరగోళం
- న్యాయమూర్తులపైకి కేసు పత్రాలు విసిరికొట్టిన వ్యక్తి
- అదుపులోకి తీసుకుని బయటకు పంపిన భద్రతా సిబ్బంది

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం నాటకీయ పరిణామాలు - మిగతా 2 లో

### ఆసీస్ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ప్రధాని మోదీ అరుదైన కానుక

20 ఏళ్ల నాటి జ్ఞాపకం



- స్టీవ్ వాకు 20 ఏళ్ల నాటి ఫొటోను బహూకరించిన ప్రధాని మోదీ
- ఆసీస్ ప్రధానితో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో పర్యటన
- చెన్నైలో తొలిసారిగా బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ నిర్వహణకు నిర్ణయం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో ఆ దేశ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఓ అరుదైన కానుకను అందజేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తామిద్దరూ తొలిసారి కలుసుకున్నప్పటి మధుర స్మృతిని గుర్తు చేస్తూ, ఆ - మిగతా 2 లో

### ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత



- దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్
- నాయుడుపేటలో రూ.1,595 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న షిన్‌హ్యూప్
- ఈ ప్లాంట్ ద్వారా 2,170 మందికి ఉద్యోగ అవకాశాలు
- శ్రీసిటీలో ఈవీ విడిభాగాల యూనిట్ ఏర్పాటు చేయాలని మోటివ్‌లింక్‌కు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా మార్చే లక్ష్యంతో - మిగతా 2 లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్




ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు,

### జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి



- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య

విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం - మిగతా 2 లో

నిజం
దృష్టి తెలుగు న్యూస్

శనివారం 11-07-2026

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

**– మొదటిపేజీ తరువాయి** వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

## తెలంగాణ జనసేనలో కొత్త జోష్

**– మొదటిపేజీ తరువాయి** రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు. వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ు

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

**– మొదటిపేజీ తరువాయి** రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

## 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

**– మొదటిపేజీ తరువాయి** 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.ద

## ఆసీస్ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ప్రధాని మోదీ అరుదైన కానుక

**– మొదటిపేజీ తరువాయి** ఫొటోను ఫ్రేమ్ చేయించి శుక్రవారం ఆయనకు బహూకరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)ను సందర్శించిన సందర్భంగా ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనతో భేటీ అయ్యారు. ఆనాటి స్మృతులను నెమరువేసుకుంటూ ప్రధాని మోదీ అందించిన ఈ వ్యక్తిగత బహుమతికి స్టీవ్ వా మంత్రముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు యువ క్రీడాకారులతో సంభాషించారు. క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లను వారు ఉత్సాహపరిచారు. ఇదే వేదికపై 'భారత్-ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను కూడా ఆవిష్కరించారు. ఈ పర్యటన సందర్భంగా క్రికెట్ ప్రేమికులకు మరో తీపి కబురు అందింది. 2026-27 బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) సీజన్ ప్రారంభ మ్యాచ్‌ను చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ఈ పోరు సాగనుంది. ఆస్ట్రేలియా గడ్డ వెలుపల బీబీఎల్ మ్యాచ్ నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం.. కడప, రాజంపేటల్లో కోవిడ్ లక్షణాలతో ఇద్దరి మృతి!

**– మొదటిపేజీ తరువాయి** స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే... జిల్లాలో ఇటీవల కొందరికి అనుమానంతో చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రమైన కరోనా లక్షణాలతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కడప, రాజంపేటల్లోని బాధిత ప్రాంతాలలో స్పెషల్ మెడికల్ టీమ్స్ పర్యటిస్తున్నాయి. మృతుల కుటుంబ సభ్యులతో పాటు, వారితో ప్రాథమికంగా పరిచయం ఉన్నవారి (ప్రైమరీ కాంటాక్స్) వివరాలను సేకరిస్తున్నారు. స్థానికంగా ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉన్నాయా అనే అంశంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మరణానికి గల కచ్చితమైన కారణాలు, వైరస్ యొక్క కొత్త వేరియంట్ ఏమైనా ఉందా అనే కోణాన్ని నిర్ధారించుకోవడానికి బాధితుల నమూనాలను సేకరించి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే, జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, ఈ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. అధికారులు అధికారికంగా నిర్ధారించే వరకు ప్రజలు భయాందోళనలకు గురికాకుండా, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత

**– మొదటిపేజీ తరువాయి** రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సియోల్‌లో ప్రముఖ ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సంస్థలైన మోటివ్‌లింక్, షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ యాజమాన్యాలతో ఆయన కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీలో తయారీ యూనిట్లు స్థాపించి, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు.

**నాయుడుపేటలో షిన్‌హ్యూప్ భారీ పెట్టుబడి**

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.1,595 కోట్ల భారీ పెట్టుబడితో తమ సంస్థ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా టేహూ కిమ్ ప్రకటించారు. ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ రంగాలకు అవసరమైన పీసీబీలు, సీసీఎల్, ఈఎంఎస్‌లను ఇక్కడ తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 2,170 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. ఏపీని తమ తయారీ కేంద్రంగా ఎంచుకున్నందుకు షిన్‌హ్యూప్ యాజమాన్యానికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. నాయుడుపేట వద్ద ఇప్పటికే అభివృద్ధి చేసిన పీసీబీ ఎకోసిస్టమ్‌లో సిర్మా, జెట్‌వర్క్, ఎపిటోమ్, సిప్సా టెక్ వంటి నాలుగు కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఏపీలో ఒక ఎండ్-టు-ఎండ్ పీసీబీ క్లస్టర్‌ను నిర్మించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని షిన్‌హ్యూప్‌ను కోరారు. ఈ ప్రతిపాదనను సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టేహూ కిమ్ హామీ ఇచ్చారు.

**శ్రీసిటీకి మోటివ్‌లింక్‌ను ఆహ్వానించిన లోకేశ్**

ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ మోటివ్‌లింక్ సీఈవో కిమ్ కి-హాన్‌తో కూడా మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో ఈవీ విడిభాగాలు, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్స్, ఇతర మాగ్నెటిక్స్ కాంపొనెంట్స్ తయారుచేసే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు శ్రీసిటీలో సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే శ్రీసిటీలో ఎంసీఎన్ఈఎక్స్, సోలమ్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటి కొరియన్ కంపెనీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. దీనిపై స్పందించిన మోటివ్‌లింక్ సీఈవో కిమ్ కి-హాన్, తమ సంస్థ ఇప్పటికే భారత్‌లో అడుగుపెట్టిందని తెలిపారు. తమిళనాడులోని చెన్నైలో స్టెర్లింగ్ టూల్స్‌తో కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను, శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ ఆటో క్లస్టర్‌లో తమ తొలి స్వతంత్ర ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని ఆయన మంత్రి లోకేశ్‌కు హామీ ఇచ్చారు. మొత్తం మీద లోకేశ్ కొరియా పర్యటన ఏపీకి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో సానుకూల ఫలితాలనిస్తోంది.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

**– మొదటిపేజీ తరువాయి** పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫొరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.

ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

అమరావతిపై కీలక నిర్ణయాలు

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు , కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.

విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.

తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

# బెంచ్‌పైకి కాగితాలు విసిరి సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం

**– మొదటిపేజీ తరువాయి** చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయమూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, కేసు పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌పై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు

**– మొదటిపేజీ తరువాయి** పోలీసులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచార సభకు ముందు జరిగిన ఆ విషాదం వెనుక కుట్ర ఉందని, పోలీసులు తనను తప్పుదోవ పట్టించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పర్యటనలో ఏర్పాటు చేసిన సభలో విజయ్ మాట్లాడుతూ.. "ఆ విషాదం నా జీవితంలో అత్యంత బాధాకరమైన క్షణం. అది నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఎంత విజయం సాధించినా జీవితంలో ఇలాంటి ఘటనలు జరుగుతాయి. నేను కరూర్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు పోలీసులు నన్ను ఆపి ఉండొచ్చు కదా? ఆ సమావేశాన్ని రద్దు చేసే హక్కు వారికి ఉంది. కానీ, వారు అలా చేయలేదు, పైగా నన్ను లోపలికి నడిపించారు" అని పోలీసుల తీరును తప్పుపట్టారు. "ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరు? దీని వెనుక ఎవరున్నారు?" అని ప్రశ్నిస్తూ, అప్పటి అధికార పార్టీ అయిన డీఎంకేపై విమర్శలు ఎక్కుపెట్టారు. తొక్కిసలాట తర్వాత తాను మౌనంగా ఉండటంపై వచ్చిన విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. "అమాయకమైన పసిపిల్లలు చనిపోయారు. నేను తీవ్ర వేదనతో ఇంట్లో కుమిలిపోతుంటే, దాక్కున్నానంటూ మీరు నన్ను ఎగతాళి చేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులు, పోలీసులు కలిసి ఈ తొక్కిసలాటను సృష్టించారని ఆరోపించారు. "పోలీసులు తగినంత సిబ్బందిని మోహరించారా? సిగ్గులేకుండా నాపై నిందలు వేశారు. అసెంబ్లీలో ఎంకే స్టాలిన్ ఈ అంశంపై రాజకీయం చేశారు" అని మండిపడ్డారు. తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎన్నికల ప్రచారాన్ని దెబ్బతీయడానికే ఈ కుట్ర పన్నారని విజయ్ ఆరోపించారు.

**కోర్టుల్లోనూ కొనసాగిన పోరు**

మరోవైపు కరూర్ తొక్కిసలాటలో మరణించిన 41 మంది కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్న విజయ్ సర్కార్ నిర్ణయంపై న్యాయపోరాటం జరిగింది. ఈ నిర్ణయం సీబీఐ విచారణలో సాక్షులను ప్రభావితం చేసేలా ఉందని ఆరోపిస్తూ డీఎంకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, డీఎంకే పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. "ఒక ముఖ్యమంత్రి ఏం చేయాలో కోర్టు చెప్పాలని మీరు కోరుకుంటున్నారా? ఈ కేసులో సీఎం విజయ్ నిందితుడు కాదు" అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని, సీబీఐ ఏర్పాటు చేసిన పర్యవేక్షక కమిటీని ఆశ్రయించింది. తాజాగా ఈరోజు ముఖ్యమంత్రి కరూర్ పర్యటనకు గంట ముందు, మద్రాస్ హైకోర్టులోని మదురై ధర్మాసనం ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. బాధితుల కుటుంబాలకు నియామక పత్రాలు అందజేయడానికి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు తాత్కాలికమైనవని, కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. దీంతో సీఎం విజయ్‌కు న్యాయపరంగా ఊరట లభించినట్లయింది.

# స్పెయిన్‌తో వాణిజ్య బంధాల రద్దుకు ట్రంప్ పిలుపు

**– మొదటిపేజీ తరువాయి** విరుచుకుపడ్డారు. స్పెయిన్ ఒక "అత్యంత దారుణమైన భాగస్వామి" అని అభివర్ణిస్తూ, ఆ దేశంతో ఉన్న అన్ని రకాల వాణిజ్య, వర్తక సంబంధాలను తక్షణమే తెంచేసుకోవాలని, రెండు దేశాల మధ్య ప్రయాణాలను కూడా నిలిపివేయాలని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్‌ను ఆదేశించారు. నాటో జనరల్ సెక్రటరీ మార్క్ రుట్టె సమక్షంలోనే ట్రంప్ ఈ సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "స్పెయిన్ ఒక దండగమారి వ్యవహారం. ఆ దేశంతో ఇకపై ఎలాంటి వ్యాపారాలు మాకు వద్దు. నాటో కూటమి రక్షణ కోసం వారు సరైన నిధులు ఇవ్వరు, భాగస్వామ్యం పంచుకోరు. వారితో మాకేం సంబంధం లేదు, వెంటనే వాణిజ్యాన్ని నిలిపివేయండి. వాళ్లే మళ్లీ మన వెనకాల పరిగెత్తుకుంటూ వస్తారు, చూడండి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 2035 నాటికి తమ జీడీపీలో 5 శాతాన్ని రక్షణ రంగానికి కేటాయించాలనే నాటో కొత్త నిబంధనకు ఒప్పుకోని ఏకైక దేశం స్పెయిన్ కావడమే ట్రంప్ ఆగ్రహానికి ప్రధాన కారణం. కాగా, నాటో చీఫ్ మార్క్ రుట్టె స్పెయిన్‌ను సమర్థిస్తూ.. ఆ దేశం రక్షణ బడ్జెట్‌ను 2 శాతానికి పెంచుతూ గతేడాది పెద్ద అడుగే వేసిందని ట్రంప్‌కు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రక్షణ బడ్జెట్‌తో పాటు ఇటీవల జరిగిన ఇరాన్-అమెరికా ఘర్షణల సమయంలో అమెరికా దాడులకు తమ వైమానిక రంగాన్ని కానీ, తమ పరిధిలోని సైనిక స్థావరాలను కానీ ఉపయోగించుకోవడానికి స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ నిరాకరించారు. అమెరికా ఏకపక్ష దాడుల వల్ల ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతుందని ఆయన బహిరంగంగానే విమర్శించారు. నాటి నుండి వాషింగ్టన్, మాడ్రిడ్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ సదస్సులోనే ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందం ముగిసిపోయిందని, ఇరాన్ నాయకులు "అనారోగ్యకరమైన మనస్తత్వం ఉన్నవారు" అంటూ ట్రంప్ మండిపడ్డారు. ట్రంప్ చేసిన ఈ తీవ్ర వ్యాఖ్యలపై స్పెయిన్ ప్రధాని కార్యాలయం శాంతంగానే స్పందించింది. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని, అమెరికాకు స్పెయిన్‌తో వాణిజ్య మిగులు ఉందని గుర్తుచేసింది. అంతేకాకుండా, ఐరోపా సమాఖ్య కస్టమ్స్ యూనియన్‌లో స్పెయిన్ భాగం కాబట్టి అమెరికా ఏకపక్షంగా ఆంక్షలు విధించలేదని స్పష్టం చేసింది. అయితే, స్పెయిన్ ఆరోగ్య శాఖ మంత్రి మోనికా గార్సియా మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. "బెదిరింపులకు లొంగనందుకే ట్రంప్ మమ్మల్ని చెడ్డ భాగస్వామి అంటున్నారు. మాది సార్వభౌమాధికారం, శాంతిని నమ్మే ప్రజాస్వామ్య దేశం. దౌత్య నీతికి, రౌడీయిజానికి మధ్య తేడా తెలియకపోవడం చాలా దారుణం" అంటూ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 11-07-2026

## ఆలయంలో అన్నదానానికి విరాళం




**జగ్గయ్యపేట,జూలై 10 నిజం న్యూస్:** పల్నాడుజిల్లా వినుకొండ మండలం భారతాపురం గ్రామ వాస్తవ్యులు పత్తి చిన నాగయ్య చిన్నరామమ్మ దంపతులు కుటుంబ సమేతంగా పెనుగంచిప్రోలులో శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు.అనంతరం వారి కుమార్తె లక్ష్మి తిరుపతమ్మ దేవస్థానం నిత్యాన్నదానపథకానికి 32,190 రూపాయలు విరాళంగా ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాస్ కు అందజేశారు.వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణ మోహన్ ,ఆలయ అర్చకులు వేద పండితులచే వేదఆశీర్వచనం ఇచ్చి, అమ్మవారి శేష వస్త్రములు,తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ




**జమ్మికుంట, జూలై 10 నిజం న్యూస్:** రాష్ట్రంలోని హమాలి కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పని భద్రత, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జమ్మికుంట మండలం కోరపల్లిలో నిర్వహించిన కరీంనగర్ జిల్లా కో-ఆపరేటివ్ హమాలి కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే జిల్లా మహాసభకు, సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు హమాలి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.ఈ సందర్భంగా కోరపల్లి యువ చైతన్య తాపీ సంఘానికి చెందిన సుమారు 20 మంది కార్యకర్తలు బుచ్చన్న యాదవ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో హమాలి కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కింద పడిన వృద్ధుడికి అండగా నిలిచిన 108 అత్యవసర సేవలు

స్కూప్ స్ట్రక్చర్ తో సురక్షితంగా అంబులెన్స్ లోకి తరలించిన అంబులెన్స్ సిబ్బంది

పైలట్ వైనాలా నాగరాజు, ఈఎంటీ పాలడుగుల రవి సేవలకు ప్రశంసలు



**చెన్నారావుపేట జూలై 10 నిజం న్యూస్:** చెన్నారావుపేట మండలం వాల్య తండాకు చెందిన బానోత్ రాములు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో ఎడమ తొంటి (హిప్) భాగంలో తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అత్యవసర సేవలు అందించారు. పైలట్ వైనాలా నాగరాజు స్కూప్ స్ట్రెచర్ సహాయంతో బాధితుడిని అత్యంత జాగ్రత్తగా అంబులెన్స్‌లోకి తరలించారు. అనంతరం ఈఎంటీ పాలడుగుల రవి గాయాన్ని పరిశీలించి, ఎడమ తొంటి భాగానికి స్ప్లింట్ అమర్చి అవసరమైన ప్రథమ చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని మెరుగైన వైద్యం కోసం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి సురక్షితంగా తరలించి వైద్యులకు అప్పగించారు. అత్యవసర పరిస్థితిలో 108 సిబ్బంది చూపిన వేగవంతమైన స్పందన, సమయోచిత వైద్య సేవలను ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అభినందిస్తూ పైలట్ వైనాలా నాగరాజు, ఈఎంటీ పాలడుగుల రవిని ప్రశంసించారు. ప్రజలు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా 108 ఉచిత అత్యవసర సేవలను వినియోగించుకోవాలని 108 సిబ్బంది సూచించారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

మట్ట పవన్ రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు



**ఇల్లంతకుంట, జూలై 10 నిజం న్యూస్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తు జన్మదిన వేడుకలను ఇల్లందకుంట మండల కేంద్రంలోని కనగర్తి గ్రామ ( జెడ్ పి హెచ్ ఎస్ )హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్ కుమార్ వీర అభిమాని మట్ట పవన్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యే సమాజ అభివృద్ధికి పునాది" అనే భావనతో ఈ చిన్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, బండి సంజయ్ అన్నగారు ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో నిండి దీర్ఘాయుష్షుతో ఉండాలని, ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులు, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి,ఉప్పుల శ్రీనివాసరెడ్డి,బచ్చల భానుచందర్,అరవింద్ రెడ్డి,ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ బంద్ సందర్భంగా నాయకుల అరెస్టు

– శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాసామ్య విరుద్ధం.

– మొయినాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేశ్వంత్, చరణ్ గౌడ్.



**మొయినాబాద్, జూలై 10 నిజం న్యూస్:** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా మొయినాబాద్ మండలంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌కు మద్దతుగా విద్యార్థులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టిన ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి చరణ్ గౌడ్ పాటు పలువురు. నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేశ్వంత్, చరణ్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.శాంతియుతంగా చేపట్టిన ప్రజాస్వామ్య నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను అరెస్టు చేయడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నవీన్, వికాస్, కార్తిక్,సంపత్,నాని,సోనూ,శివ, అభిలాష్, అభి ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ పట్టణశీ మున్సిపల్ ఆఫీస్ లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆకస్మిక తనిఖీ

నిర్లక్ష్యంపై అధికారులకు తీవ్ర హెచ్చరిక



**హుజురాబాద్, జూలై 10 నిజం న్యూస్:** హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈరోజు మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులను నిలదీశారు. పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, చెత్త సేకరణ, ప్రధాన చౌరస్తాల పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులను ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల నుంచి నిరంతరం ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, దీనివల్ల ప్రజలు అనవసర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాలని, మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెత్త సేకరణను ప్రతిరోజూ సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన చౌరస్తాలు, రహదారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని, నిర్లక్ష్యం లేదా అలసత్వం ఏమాత్రం సహించబోనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారులను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. హుజురాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, సమస్యల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రతి సమస్యపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గారు తెలిపారు.

## ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూలై 10 నిజం న్యూస్:** ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను కాలానుగుణంగా మెరుగుపరుచుకోవాలని, భౌతిక శాస్త్ర బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, సమగ్ర విద్య అభ్యసన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఆధునిక బోధన పద్ధతులను అలవర్చుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన దానికంటే విద్యార్థులు చూస్తూ నేర్చుకుంటారని, ప్రతి విద్యార్థికి డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ, కృత్యాధార బోధన ద్వారా అభ్యసనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సరిపడా ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు వంటి అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో ఉందని, ఖాళీగా ఉన్న చోట విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. విద్యాశాఖ జిల్లా, మండల అధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షిస్తారని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ లేదు

**నందిగామ, జూలై 10 నిజం న్యూస్:** చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించిన ఆమె సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పౌరుడికి పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి వద్దకే పాలనను తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి వినతిని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ధరల దెబ్బకు వృద్ధి పరార్.. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా కోతలు

**పెరుగుతున్న క్రూడాయిల్ రేట్లతో భారత్ జీడీపీ తగ్గొచ్చంటున్న ఏడీబీ**

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను 6.6 శాతంగానే అంచనా**

న్యూఢిల్లీ, జూలై 9: ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు పడిపోవచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) హెచ్చరించింది. ఈ క్రమంలోనే 6.6 శాతంగా అంచనా వేసింది. అంతకుముందు 6.9 శాతంగా ఉండటం గమనార్హం. కాగా, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలే ఈ వృద్ధి కోతలకు కారణమని తాజా ఎడిషన్‌లో ఏడీబీ స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతుండటంతో పశ్చిమాసియాను మళ్లీ సంక్షోభం ఛాయలు అలుముకున్నాయి. మిడిల్ ఈస్ట్‌లో మరోమారు యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అగ్రరాజ్యానికి అండగా ఉంటున్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది మరి. ఈ నేపథ్యంలోనే భారత జీడీపీ ప్రగతి అంచనాకు 30 బేసిస్ పాయింట్లు ఏడీబీ కోత పెట్టింది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2027-28)గాను వృద్ధిరేటు అంచనాను 7.3 శాతంగానే కొనసాగించింది.

**ఇదీ సంగతి..**

దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలదే మెజారిటీ వాటా. ఈ దేశాల నుంచి వచ్చే ముడి చమురు హార్ముజ్ జలసంధి మీదుగానే వస్తున్నది. అయితే ఇరాన్ దాడులతో నౌకా రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇక ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేస్తామంటూ చేసిన ప్రకటన బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ రేటును 70 డాలర్ల నుంచి 80 డాలర్లకు తీసుకెళ్లింది. ఫలితంగా భారతీయ దిగుమతులు ఆ మేరకు భారంగా మారాయి. ఇది దేశంలో ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే రిటైల్ మార్కెట్‌లో ధరలు తారెత్తిస్తున్న సంగతి విదితమే. ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి అన్నింటి రేట్లూ పరుగులు పెట్టడం ఖాయం. దాంతో ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు, రుణ లభ్యత పతనం, వ్యాపార-పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి క్షీణత.. తుదకు జీడీపీ పడిపోవడమే జరుగుతుందని ఎక్స్‌పర్ట్స్ గుర్తుచేస్తున్నారు. ఏడీబీ తాజా కోతలూ ఈ సంకేతాలనే ఇస్తున్నాయి మరి.

**పెరుగనున్న ఇంధన ధరలు?**

గల్ఫ్ వార్ తీవ్రతరమైతే.. దేశంలో ఇంధన ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు లేకపోలేదు. నిజానికి ఆ మధ్య గరిష్ఠ స్థాయిలకు క్రూడాయిల్ రేట్లు చేరినా.. ఆ తర్వాత అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంతో ఉద్రిక్తతలు తగ్గి ధరలూ పడిపోయాయి. అయినప్పటికీ చమురు మార్కెటింగ్ సంస్థలు.. పెంచిన ఇంధన ధరలను దించలేదు. ఇప్పటికీ రిటైల్ అమ్మకాలపై నష్టాలే వస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి మరి. ఈ క్రమంలో పశ్చిమాసియా సంక్షోభం ముదిరితే.. క్రూడాయిల్ బ్యారెల్ రేటు త్వరలోనే 100 డాలర్లను దాటేయగలదు. దానికి తగ్గట్టుగా దేశీయ మార్కెట్‌లోనూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరుగవచ్చన్న అభిప్రాయాలు ఇప్పుడు జోరుగా వినిపిస్తున్నాయి.

**అనేక ప్రతికూలతలు**



దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రస్తుతం అనేక ప్రతికూల పరిస్థితుల ప్రభావం కనిపిస్తున్నది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ నష్టపోతుండటం, దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను వెనుకకు తీసుకుంటుండటం, స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం, ఎగుమతులకు అంతరాయం, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, ఏఐ దెబ్బకు కుదేలవుతున్న ఐటీ రంగం, విమానయానంపై ఆంక్షలు, వర్షాభావ పరిస్థితులు వంటివి జీడీపీ ప్రగతిని దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ వార్.. భారత్ వృద్ధికున్న అవకాశాలను మరింతగా కఠినం చేస్తున్నాయని మార్కెట్ విశ్లేషకుల మాట. మిడిల్ ఈస్ట్ సంక్షోభ పరిస్థితులు దిగజారితే విదేశీ మారకం నిల్వలను కాపాడుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సైతం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చని వారంటున్నారు. ఇప్పటికే దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు పసిడి కొనుగోళ్ల అదుపునకు పిలుపునిచ్చిన మోదీ సర్కార్.. మరోవైపు విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ అమ్మకాలను పెంచుతున్నది. అయితే వార్ దెబ్బకు భారత్ ఆశలన్నీ ఆవిరయ్యేలా ఉన్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను భారత జీడీపీ వృద్ధిరేటును 6.9 శాతంగా అంచనా వేశాం. అయితే అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు.. గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ రేట్ల విజృంభణకు దారితీస్తున్నాయి. అందుకే పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో దేశ ఆర్థిక ప్రగతి అంచనాను 6.6 శాతానికి పరిమితం చేస్తున్నాం. ఇక ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతానికి పెరుగవచ్చు.

# ట్రంప్ దెబ్బకు క్రాష్.. భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

**భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు**

**సెన్సెక్స్ 1,677, నిఫ్టీ 517 పాయింట్లు డౌన్**

**ఒక్కరోజే రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**మళ్లీ పశ్చిమాసియా సంక్షోభ భయాలు**

**అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు**

ముంబై, జూలై 8: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా నష్టపోయాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ఇక ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన.. ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి దారితీసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగడం కూడా మదుపర్లను పెట్టుబడుల ఉపసంహరణలకు ఉసిగొల్పింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,677.12 పాయింట్లు లేదా 2.15 శాతం పతనమై 76,503.60 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,921.69 పాయింట్లు క్షీణించడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 516.65 పాయింట్లు లేదా 2.12 శాతం పడిపోయి 24వేల మార్కుకు దిగువన 23,882.05 దగ్గర నిలిచింది.

ఉదయం ఆరంభం నుంచే..

సూచీలు ఉదయం ఆరంభం నుంచే సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు, పరుగులు పెడుతున్న ముడి చమురు ధరల మధ్య సెన్సెక్స్ 534, నిఫ్టీ 164 పాయింట్లు పతనమయ్యాయి. సమయం గడుస్తున్నకొద్దీ నష్టాలు పెరుగుతూపోయాయి. ఇరాన్‌తో ఇక తాడోపేడో తేల్చుకోవడమే అన్న సంకేతాలు ట్రంప్ నుంచి రావడం.. క్రూడాయిల్ రేట్లను మరింత విజృంభించేలా చేసింది. దీంతో మదుపర్లు అమ్మకాలకు పెద్దపీట వేశారు. ఫలితంగా ఇండిగో, మారుతీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు సహా బీఎస్ఈ బ్లూచిప్ ఇండెక్స్ అయిన సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లూ నష్టాల్లోనే ముగియాల్సి వచ్చింది. అసలే ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశాజనకంగా ఉంటాయన్న అంచనాలున్నాయి. వీటికి ఇప్పుడు మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు కూడా తోడయ్యాయి. ఈ నేపథ్యంలో మళ్లీ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లోకి జారుకోవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. -ఈ ఒక్కరోజే అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీకి 2 శాతానికిపైగా నష్టాలు బీఎస్ఈలో రెడ్ జోన్‌లోనే ముగిసిన 3,211 స్టాక్స్ మిడ్‌క్యాప్ సూచీ 2.14 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.61 శాతం డౌన్‌దాదాపు 7 శాతం ఎగబాకిన క్రూడాయిల్ ధరలతో మదుపర్లు బెంబేలు సర్వీసెస్ (3.21%), ప్రభుత్వ బ్యాంకులు (2.76%), ఎఫ్ఎంసీజీ (2.54%) షేర్లు కుదేలు 6.18 శాతం ఎగిసి 78.74 డాలర్లకు చేరిన బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర ఆసియా ప్రధాన మార్కెట్లలో హాంకాంగ్ మినహా దక్షిణ కొరియా, జపాన్, చైనా సూచీలకు నష్టాలు నష్టాల్లోనే కదలాడుతున్న అమెరికా, ఐరోపా మార్కెట్లు నష్టాలకు ప్రధాన కారణాలు అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు రిస్క్‌లో హార్ముజ్ జలసంధిలో రవాణా పెరిగిన ముడి చమురు ధరలు డాలర్‌తో పోల్చితే రూపీ విలువ క్షీణత భయాందోళనల్లో మదుపర్లు క్యూ1 ఆర్థిక ఫలితాలపైనా గుబులు అమ్మకాల ఒత్తిడిలో కీలక రంగాల షేర్లు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడుల నేపథ్యంలో ఆ దేశంతో కుదుర్చుకున్న మధ్యంతర శాంతి ఒప్పందం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన.. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ముడి చమురు ధరలు సైతం ప్రతికూలంగా మారాయి. -పొన్ముడి ఆర్, ఎన్రిచ్ మనీ సీఈవోజుఆశీఅశీఎఱఎం




అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తకర వాతావరణం ఏర్పడింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం దిశగా నడుస్తున్నది. ఇవన్నీ కూడా దేశీయ ఈక్విటీ మార్కెట్లలో మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ముగియడం, ట్రంప్ భీకర దాడులు చేస్తామని చెప్పడం కూడా అమ్మకాల ఒత్తిడికి దారితీసింది. -అంకుర్ పుంజ్, ఈక్విరస్ వెల్త్ ఎండీ

8.96 లక్షల కోట్లు మటాష్

స్టాక్ మార్కెట్లు భీకర నష్టాలపాలవడంతో బుధవారం ఒక్కరోజే మదుపర్ల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ సుమారు రూ.9 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. అమెరికా-ఇరాన్ వార్‌తో గల్ఫ్‌లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా రూ.8.96 లక్షల కోట్లు పడిపోయి రూ.4,71,23,612.10 కోట్ల (4.95 ట్రిలియన్ డాలర్లు)కు బీఎస్ఈ మార్కెట్ క్యాప్ పరిమితమైంది. వరుసగా 4 రోజుల ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడిన సంగతి విదితమే. బడా కార్పొరేట్లు ఈ ఏప్రిల్-జూన్‌లో ప్రకటించే ఆర్థిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండబోవన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపర్చాయి. ఇప్పుడు ఈ భయాలకు పశ్చిమాసియా సంక్షోభం తోడైనట్టైంది

# టీసీఎస్ లాభం 13,349 కోట్లు.. రూ.12 డివిడెండ్ ప్రకటించిన సంస్థ




ముంబై, జూలై 9: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.13,349 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,760 కోట్ల లాభంతో పోలిస్తే 4.61 శాతం వృద్ధిని కనబరిచింది. 315 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న దేశీయ ఐటీ రంగానికి కృత్రిమ మేధస్సుతో ఇబ్బందులు తప్పవనే అంచనాల నేపథ్యంలో దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ లాభాల్లో వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14 శాతం ఎగబాకి రూ.72,275 కోట్లకు చేరుకోగా, మార్చి త్రైమాసికంతో పోలిస్తే 2.23 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. దీంట్లో ఏఐ టెక్నాలజీ సేవలు అందించడంతో సంస్థకు 2.6 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరడం విశేషం. ఈ సందర్భంగా టీసీఎస్ సీఈవో, ఎండీ కే కృతివాసన్ మాట్లాడుతూ..భౌగోళిక రాజకీయ, స్థూల ఆర్థిక ప్రతికూలతలు ఉన్నప్పటికీ, ఈ త్రైమాసికంలో వృద్ధిని నమోదు చేసుకున్నట్టు, వినియోగదారులు ఏఐ, ఆధునీకరణ, సైబర్ సెక్యూరిటీ, సావరిన్ క్లౌడ్ టెక్నాలజీపై దృష్టి సారించడం కలిసొచ్చిందన్నారు. గత త్రైమాసికంలో కొత్తగా 9.5 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు చెప్పారు. వీటిలో 800 మిలియన్ డాలర్ల విలువైన ఏఐ ఆధారిత ఒప్పందాలు ఉండటం విశేషం.

**9 వేలు పెరిగిన ఉద్యోగాలు**

గడిచిన త్రైమాసికంలో టీసీఎస్ కొత్తగా 9,200 మంది ఉద్యోగులను నియమించుకున్నది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,93,798కి చేరుకున్నారు. కంపెనీలో ఉద్యోగుల వలసలు 13.6 శాతంగా నమోదయ్యాయి. నూతన టెక్నాలజీ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెక్స్ట్ జనరేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫాం కోసం దీర్ఘకాలికంగా పెట్టుబడులు కొనసాగనున్నాయని కంపెనీ చీఫ్ మానవ వనరుల అధికారి సుదీప్ కున్నుమాల్ తెలిపారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు స్వల్పంగా నష్టపోయి రూ.2,047.75 వద్ద ముగిసింది.

# నెట్ బౌలర్ నుంచి టెస్ట్ హీరోగా.. మానవ్ సుతార్ అద్భుత ప్రయాణం



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం : ముల్లాన్‌పూర్ టెస్టుకు ముందు భారత తుది జట్టు ఎంపికపై విమర్శలు వచ్చాయి. ఇది టీమిండియానా లేక ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ జట్టా? అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు వేశారు. కెప్టెన్ గిల్‌తో పాటు సుదర్శన్, సుందర్, ప్రసిధ్, సిరాజ్, మానవ్ సుతార్ రూపంలో ఏకంగా ఆరుగురు జీటీ ఆటగాళ్లకు తుది జట్టులో చోటు దక్కడంతో తీవ్రమైన ట్రోల్స్ నడిచాయి. కానీ, మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో విమర్శలు వచ్చిన ఈ ఆటగాళ్లే అద్భుతంగా రాణించి భారత్‌కు ఘన విజయాన్ని అందించారు. అందునా అరంగేట్రం ఆటగాడు మానవ్ సుతార్ తన ఎంపికకు 100 శాతం న్యాయం చేస్తూ, పదునైన బౌలింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు.తాజా తెలుగు వార్తలు ప్రతిభకు కఠిన శ్రమ, పట్టుదల తోడైతే ఎలాంటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని నిరూపించాడు. గతంలో గుజరాత్ టైటాన్స్ జట్టులో ఒక సాధారణ నెట్ బౌలర్‌గా ప్రయాణాన్ని ప్రారంభించిన 23 ఏండ్ల ఈ కుర్రాడు ఇప్పుడు భారత్ తరఫున టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేసి..తొలి మ్యాచ్‌లోనే సరికొత్త రికార్డులను సృష్టిస్తూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును కైవసం చేసుకున్నాడు. బ్యాట్‌తోనూ విలువైన పరుగులు చేసిన అతని ప్రదర్శన.. భారత క్రికెట్ వర్గాలకు ఆశ్చర్యం కలిగించినప్పటికీ, గుజరాత్ టైటాన్స్ అసిస్టెంట్ కోచ్ ఆశిష్ కపూర్, హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రాకు మాత్రం ఇది ఊహించిన విజయమే.తెలంగాణ ప్రభుత్వ అప్పులు

**బయో బబుల్ తెరిచిన అదృష్ట ద్వారం**

లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ ఎదుగుదల వెనుక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ అరంగేట్రం చేసిన 2022 సీజన్ సమయంలో కోవిడ్ నిబంధనల వల్ల జట్లు బయో బబుల్‌లో ఉండేవి. ఆ సమయంలో టైటాన్స్‌కు నెట్ బౌలర్ల అవసరం ఏర్పడింది.తొలుత రాజస్థాన్‌కే చెందిన మరో బౌలర్ శుభం శర్మను ఎంపిక చేయాలని అనుకున్నా.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం కావడంతో ఆశిష్ కపూర్ సూచనతో సుతార్‌కు అవకాశం దక్కింది. 'మొదటి రెండు రోజులు అతడు నెట్స్‌లో బౌలింగ్ చేసిన విధానం చూసి జట్టులోని ప్రతి ఒక్కరూ అభిమానులుగా మారిపోయారు. అప్పటి నుంచి దాదాపు రెండేండ్ల పాటు నెట్ బౌలర్‌గా ఉన్న అతడిని, ఆ తర్వాతే జట్టులోకి తీసుకున్నాం' అని ఆశిష్ కపూర్ గుర్తు చేసుకున్నాడు. పిచ్ సహకరించకపోయినా బంతిని అద్భుతంగా టర్న్ చేయగల సామర్థ్యం సుతార్ సొంతం. దేశవాళీ క్రికెట్‌లోనూ అతనికి మంచి రికార్డు ఉంది.

**జడేజా వారసుడిగా..**

భారత టెస్ట్ జట్టులో సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్థానాన్ని భర్తీ చేయగల సత్తా సుతార్‌కు ఉందని కోచింగ్ సిబ్బంది ఏడాది కాలంగా చర్చిస్తున్నారు. ముల్లాన్‌పూర్ టెస్ట్ ద్వారా ఆ నమ్మకం నిజమైంది. 2011లో అశ్విన్ తర్వాత అరంగేట్రంలోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గెలిచిన భారత రెండో స్పిన్నర్‌గా సుతార్ నిలిచాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ కాలం రాణించాలంటే సుతార్ తన 'గేమ్ స్మార్ట్‌నెస్'ను మెరుగుపరుచుకోవాలని, ఫ్లాట్ పిచ్‌లపై వికెట్లు తీసేలా కొత్త వ్యూహాలను అవలంబించాలని కోచ్‌లు సూచిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, నెట్ బౌలర్ స్థాయి నుంచి దేశాన్ని గెలిపించే టెస్ట్ హీరోగా ఎదిగిన మానవ్ సుతార్ ప్రయాణం ఎందరో యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలిచింది.

**1 పరుగుల పరంగా టెస్టుల్లో భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం. 2018లో వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 272 పరుగుల తేడాతో గెలిచిన రికార్డు మెరుగైంది.**

**2 భారత్ తరఫున అరంగేట్రం టెస్టులో అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండో బౌలర్ సుతార్ (6/33, 1/29). 1988లో వెస్టిండీస్‌పై నరేంద్ర హిర్వాణి రెండు ఇన్నింగ్స్‌లో 8/61, 8/75 ప్రదర్శనలతో ముందంజలో ఉన్నాడు.**

**3 ఒక టెస్ట్ మ్యాచ్‌లో 25 ప్లస్ రన్స్, ఐదు వికెట్ల స్పెల్‌తో పాటు మూడు క్యాచ్‌లు అందుకున్న మూడో క్రికెటర్ సుతార్. గతంలో అల్బర్ట్ ట్రాట్(1895), జోయల్ గార్నర్ (1977) ఈ ఫీట్ సాధించారు.**

**9 భారత్ తరఫున అరంగేట్రం టెస్టులోనే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్న తొమ్మిదో ప్లేయర్ మానవ్. ఈ జాబితాలో ఆరుగురు బ్యాటర్లు కాగా, 2006లో పాక్‌పై ఆర్పీ సింగ్, 2011లో వెస్టిండీస్‌పై అశ్విన్ ఈ ఘనత సాధించారు.**

**15 అఫ్గానిస్థాన్‌తో ఇప్పటి వరకు 15 అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన భారత్.. ఒక్కసారి కూడా ఓడిపోలేదు.**

# ఫైనల్‌కు ఖమ్మం.. హైదరాబాద్‌కు తొలి ఓటమి

**క్వాలిఫయర్-2కు కరీంనగర్**



టీజీ20 లీగ్‌లో ఖమ్మం ఏసెస్ సంచలన విజయంతో ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. లీగ్‌లో పరాభవమెరుగని హైదరాబాద్ ఈ-చాంపియన్స్‌కు క్వాలిఫయర్స్-1లో ఓటమి రుచిని చూపించింది. ఇరుజట్ల మధ్య గురువారం రాత్రి జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో ఖమ్మం.. 10 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం.. నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 రన్స్ చేసింది. మికిల్ జైస్వాల్ (76), జీఎస్‌కే రెడ్డి (40) రాణించారు. హైదరాబాద్ 20 ఓవర్లకు 190/8 వద్దే ఆగిపోయింది. ఆ జట్టు తరఫున వికాస్ (69) టాప్ స్కోరర్‌గా నిలిచారు. అంతకుముందు జరిగిన ఎలిమినేటర్‌లో కరీంనగర్ డైమండ్స్ 75 పరుగుల తేడాతో రంగారెడ్డి రైజర్స్‌ను చిత్తుచేసి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. టోర్నీలో సెంచరీల మోత మోగిస్తున్న కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (61 బంతుల్లో 137, 11 ఫోర్లు, 10 సిక్స్‌లు) మూడో శతకంతో చెలరేగగా ఆ జట్టు 20 ఓవర్లకు ఏడు వికెట్లు కోల్పోయి 238 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో కరీంనగర్ బౌలర్ ఆశిష్ శ్రీవాత్సవ్ (5/16) ఐదు వికెట్ల ప్రదర్శనతో రంగారెడ్డి 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. శుక్రవారం జరిగే క్వాలిఫయర్స్-2లో కరీంనగర్.. హైదరాబాద్‌తో తలపడనుంది. ఆదివారం ఫైనల్ జరుగుతుంది.

# క్రికెట్ మక్కాలో అమ్మాయిల తొలి సంతకం

**లార్డ్స్ స్టేడియంలో తొలిసారి మహిళల టెస్ట్ మ్యాచ్**

**నేటి నుంచే ఇంగ్లండ్, భారత్ మ్యాచ్**



లండన్: క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్‌లో సరికొత్త చరిత్ర ఆవిష్కృతం కానుంది. 142 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కల్గిన ఈ 'క్రికెట్ మక్కా'లో తొలిసారి మహిళా జట్లు టెస్టు మ్యాచ్ ఆడబోతున్నాయి. మెన్స్ క్రికెట్‌లో 150 టెస్టులకు ఆతిథ్యమిచ్చి ఆటలో ఎందరో దిగ్గజ ఆటగాళ్ల విన్యాసాలకు సాక్ష్యంగా నిలిచిన లార్డ్స్.. మొట్టమొదటిసారి అమ్మాయిల టెస్టులకు ఆతిథ్యమివ్వనున్నది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలోనే నిష్క్రమించిన భారత్, ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి నుంచి ఇంకా తేరుకోని ఇంగ్లండ్.. శుక్రవారం మొదలయ్యే ఏకైక టెస్టు మ్యాచ్‌లో తలపడనున్నాయి. రెడ్‌బాల్ క్రికెట్‌లో ఇంగ్లిష్ జట్టుపై మెరుగైన రికార్డు ఉన్న ఉమెన్ ఇన్ బ్లూ.. ఆతిథ్య జట్టును ఎలా ఎదుర్కుంటుదనేది ఆసక్తికరం.

**మనదే ఆధిపత్యం**

ఇంగ్లండ్‌తో టెస్టుల్లో భారత్‌దే సంపూర్ణ ఆధిపత్యం. ఇరుజట్ల మధ్య జరిగిన 15 టెస్టుల్లో టీమిండియా ఓడింది ఒక్కటే ఒక్క మ్యాచ్‌లో. మూడింట్లో గెలిచి 11 మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. ఇంగ్లిష్ గడ్డపై అయితే 1995 నుంచి భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. ఇరుజట్ల మధ్య చివరిసారిగా 2023లో నవీ ముంబై వేదికగా జరిగిన టెస్టులో హర్మన్‌ప్రీత్ సేన ఏకంగా 347 పరుగుల భారీ తేడాతో గెలిచింది. సుమారు నెల రోజులుగా ఇంగ్లండ్‌లోనే ఉంటున్న భారత్ అక్కడి పరిస్థితులకు బాగానే అలవాటు పడింది.టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో నిష్క్రమించాక పూర్తిస్థాయిలో ఈ టెస్టు మీదే దృష్టిసారించిన హర్మన్‌ప్రీత్ టీమ్.. నాట్ సివర్ జట్టుపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలని భావిస్తున్నది. ఈ మ్యాచ్‌లో తెలుగమ్మాయి శ్రీచరణితో పాటు హర్లీన్ డియోల్, నందిని శర్మ అరంగేట్రం చేయనున్నారు. ఇంగ్లండ్ నుంచి అలీస్ క్యాప్సీ, టిల్లి కార్టిన్, మాడీ విలియర్స్, గ్రేస్ పాట్స్, ఎల్లీ త్రెల్కెల్ ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇంగ్లిష్ ఓపెనర్ టామీ బ్యూమంట్‌కు ఇదే ఆఖరి టెస్టు కావడం గమనార్హం.